సాక్షి
అనంతపురం
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.12 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.2°/22.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

22 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో జడితో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 22 మండలాల పరిధిలో 6.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పుట్లూరు 37.6 మి.మీ, తాడిపత్రి 31.4 మి.మీ, యాడికి 24 మి.మీ, పెద్దపప్పూరు 18.6 మి.మీ, గుంతకల్లు, శింగనమల, నార్పల 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాయదుర్గం, కంబదూరు, శెట్టూరు, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లోనూ వర్షాలు కురిశాయి. ఆగస్టు సాధారణం 83.8 మి.మీ కాగా 151.7 శాతం అధికంగా 211.1 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి 208.7 మి.మీ గానూ 83.5 శాతం అధికంగా 383.2 మి.మీ నమోదైంది. మొత్తంగా 26 వర్షపు రోజులు (రెయినీ డేస్) రికార్డయ్యాయి. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

అదనపు సీట్లన్నీ ఎస్సీ విద్యార్థులకే

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో అదనంగా పెరిగిన సీట్లన్నీ రోస్టర్ కమ్ రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ విద్యార్థులకే దక్కుతాయని, వారు మాత్రమే అర్హులని కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈనెల 3వ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించారు. గతంలో ప్రవేశ పరీక్ష సెప్టెంబరు 1 అని ప్రకటించగా, ఇప్పుడు ఈనెల 4కు వాయిదా వేశారు. 6,7,8 తరగతుల్లో మొత్తం 189 సీట్లను భర్తీ చేయనున్నారు. అలాగే 5వ తరగతికి సంబంధించి 80 సీట్లను అదనంగా భర్తీ చేయనున్నారు. గతంలో బీఆర్ఏజీసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

ఖాద్రీశా..కరుణించవయా



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పోటెత్తిన భక్త జనం

కదిరి టౌన్: శ్రావణ మాసం చివరి శనివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయమే శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశునికి ప్రత్యేక అలంకరణ చేసిన అర్చకులు వివిధ పూజలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలోనూ భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కేశవా..ఈ నీరెలా తాగాలి?



- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఇలాకాలో దుస్థితి
- ఉరవకొండలో రంగు మారిన, బురద నీరు సరఫరా
- చుట్టుపక్కల మరో 8 గ్రామాలకూ ఆ నీరే గతి
- రోగాల బారిన పడుతున్న ప్రజలు





నింబగల్లు వద్ద కాలం చెల్లిన ఫిల్టర్ బెడ్లు, ఉరవకొండలో కుళాయిల నుంచి సరఫరా అయిన రంగు మారిన నీరు

ఉరవకొండ: సాక్షాత్తూ రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. గత రెండు వారాలుగా దుస్థితి నెలకొన్నా ఎవరికీ పట్టడం లేదు. కొన్ని రోజులుగా జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అతిసారం వంటి సీజనల్ వ్యాధుల బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగు మారిన, బురద నీరు..

పట్టణంలో కుళాయిలకు సరఫరా అవుతున్న నీటిని తాగితే రోగాల బారిన పడటం ఖాయంగా కన్పిస్తోంది. హెచ్చెల్సీ నుంచి పంపింగ్ చేసిన నీటిని శుద్ధి చేయకపోవడంతో కుళాయిలకు రంగుమారిన, బంక మట్టితో కూడిన నీరు సరఫరా అవుతోంది. ఉరవకొండ మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నుంచి పట్టణంతో పాటు 8 గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. హెచ్చెల్సీ నుంచి ముందుగా ఇక్కడికి నీరు పంపింగ్ అవుతాయి. అలా వచ్చిన నీటిని శుద్ధి చేసి కుళాయిలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం 5 ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఫిల్టర్ బెడ్లకు కాలం చెల్లడంతో నీరు ఒక్క శాతం కూడా శుద్ధి కావడం లేదు. ఈ క్రమంలో కాలువ నుంచి పంపింగ్ చేసిన నీరు నేరుగా కుళాయిలకు సరఫరా అవుతోంది. రంగుమారిన, బంక మట్టితో ఉన్న నీటినే స్థానికులు పట్టుకుంటున్నారు. ఫిల్టర్ బెడ్లను శుభ్రం కూడా చేయక పెద్ద ఎత్తున చెత్త, పాచి పేరుకుపోవడంతో ఆ నీరు మరింత కలుషితంగా మారుతోంది. అలాంటి నీటిని తాగేందుకు కాదు కదా.. కనీసం ఇంటి అవసరాలకు కూడా వినియోగించుకోలేకపోతున్నారు.

రోగాల బారిన ప్రజలు..

ఫిల్టర్ నీరు కొనుగోలు చేసి తాగే స్తోమత లేని పేద ప్రజలు కుళాయిలకు సరఫరా అయ్యే నీటినే తాగుతున్నారు. రోగాల బారిన పడుతున్నారు. వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా ఇలాంటి కేసుల సంఖ్య ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పెరుగుతోంది. ఆస్పత్రిలోని దాదాపు అన్ని బెడ్లలోనూ బాధితులు చికిత్స పొందుతుండడం గమనార్హం.

కలుషిత నీరు ఎలా తాగాలి



కుళాయిలకు 10 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఆ నీటిని ఇంటి అవసరాలకు కూడా వాడుకోలేని పరిస్థితి ఉంది. దిక్కులేని స్థితిలో వాటిని తాగిన పిల్లలకు అనారోగ్యం చేస్తోంది. నీటిని శుద్ధి చేయకుండా సరఫరా చేయడం తగదు.

– దొకారి మంజుల, ఉరవకొండ



డ్రైవర్స్‌కాలనీలో ఓ డ్రమ్ములో బురద నీరు

ప్రజారోగ్యం ప్రభుత్వానికి పట్టడం లేదు



ప్రజారోగ్యం గురించి ప్రభుత్వానికి, అధికారులకు ఏ మాత్రమూ పట్టడం లేదు. రెండు వారాలుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. అలసత్వ వైఖరి ఇలాగే కొనసాగితే వైఎస్సార్ సీపీ తరఫున ఆందోళనలు చేపడతాం.

– లలితమ్మ, సర్పంచ్, ఉరవకొండ

ఆటోలో గ్యాస్ సిలిండర్ లీక్



గ్యాస్ సిలిండర్‌కు మూత పెడుతున్న సిబ్బంది

గుత్తి: ఆటోలో గ్యాస్ సిలిండర్ తీసుకెళ్తుండగా గ్యాస్ లీకైంది. డ్రైవర్ ఆటోను ఆపి సిలిండర్‌ను రోడ్డు పక్కన కంప చెట్లలోకి విసిరేశాడు. వివరాలిలా ఉన్నాయి. మాముడూరుకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్ గుత్తిలో గ్యాస్ సిలిండర్ తీసుకున్నాడు. ప్యాసింజర్లతో పాటు గ్యాస్ సిలిండర్‌ను మాముడూరుకు తరలిస్తుండగా.. పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో గ్యాస్ సిలిండర్ లీకైంది. డ్రైవర్ గమనించి ఆటోను ఆపి గ్యాస్ సిలిండర్‌ను రోడ్డు పక్కన కంపచెట్లలోకి విసిరేశాడు. స్థానికులు భయంతో పరుగులు తీశారు. అయితే నరేష్ రాయల్ అనే యువకుడు గమనించి గ్యాస్ సిబ్బందికి సమాచారమిచ్చాడు. సిబ్బంది అక్కడికి వచ్చి సిలిండర్ వద్దకు వెళ్లి ఊడిపోయిన మూతను సరి చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

3న 'పొలం పిలుస్తోంది'

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల మూడో తేదీన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు శనివారం తెలిపాయి. వారంలో మంగళ, బుధవారం రెండు రోజుల పాటు రోజుకు రెండు గ్రామాల చొప్పున వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు, సిబ్బంది, అలాగే శాస్త్రవేత్తలతో కూడిన బృందాలు పొలాలను సందర్శించి, గ్రామ సభలు నిర్వహిస్తారని పేర్కొన్నాయి. ఏడాదిలో నాలుగు నెలల ఖరీఫ్, నాలుగు నెలల రబీలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు కొనసాగించాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపాయి.

జిల్లాకు భారీ వర్ష సూచన

- విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: జిల్లాకు భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి విపత్తు ఎదురైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. పాత మిద్దెలు, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిలో నివాసముంటున్న వారికి సురక్షిత ప్రదేశంలో వసతి ఏర్పాటు చేయాలని చెప్పారు.

కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయండి

వర్షాలతో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లు 8500292992, 08554–220009కు ఫోన్ చేయాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. మండల తహసీల్దారు కార్యాలయాన్నీ సంప్రదించవచ్చన్నారు. వాగులు, వంకల వద్దకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాల వద్ద, చెట్ల కింద ఉండవద్దని ప్రజలకు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ నారాయణ శర్మ, ఎస్పీ జగదీష్

మట్టి గణపతినే పూజించండి

పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ సహకారంతో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ వినాయక మహోత్సవ నిర్వహణ కమిటీ, నిమజ్జన కమిటీలు ముందుగానే ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవడంతో పాటు రూ.500 చలానా కట్టి అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మైక్, సౌండ్ సిస్టం, డీజే వాడకూడదని చెప్పారు. మంటపాల వద్ద మద్యపానం చేసినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

- జంజురాంపల్లి ఇసుక స్టాక్ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక విక్రయాలపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నిర్ణయించిన ధరకే ఇసుక రవాణా చేయాలన్నారు. అనధికార తవ్వకాలు, రవాణా అరికట్టేందుకు జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన కల్పించండి

ఆత్మకూరు: ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని బి. యాలేరు గ్రామం వద్ద చీనీ పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్, చీనీ తదితర పంటలు వేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ తదితరులున్నారు.

పింఛన్.. ఎగిరిపోయెన్

- జిల్లావ్యాప్తంగా 861 మంది పెన్షన్ల తొలగింపు
- లేనిపోని కారణాలను చూపి నిలిపేసిన ప్రభుత్వం
- లబ్ధిదారులు ఆధారాలు చూపించినా కనికరించని వైనం

అనంతపురం క్రైం: లేనిపోని కారణాలను చూపి కూటమి ప్రభుత్వం పింఛన్లను ఆపేస్తోంది. జిల్లావ్యాప్తంగా 861పైగా పింఛన్లు ఈ నెలలో నిలిపేసింది. లబ్ధిదారులు తగిన ఆధారాలు చూపినా అధికారులు కనికరించలేదు. తొలగించిన పింఛన్‌ను మళ్లీ పొందడానికి సమయం పడుతుందని చెప్పడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. విషయాన్ని మీడియాకు చెబితే శాశ్వతంగా తొలగిస్తామని టీడీపీ నేతలు బెదిరించడంతో బాధితులు నోరు మెదపడం లేదు.

లెక్కలు దాచిన అధికారులు..

ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల లెక్కలపై అధికారులు కూడా గోప్యత పాటిస్తున్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సమీక్షలు, సమావేశాలతో ఆగస్టు 28 నుంచి ప్రభుత్వం ఆర్భాటం చేసింది. కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా వరుస సమావేశాలు నిర్వహించి పంపిణీ బాగా జరపాలన్న ఆదేశాలు మినహా పింఛన్లకు సంబంధించిన వివరాలు ఎక్కడా వెల్లడించకపోవడం గమనార్హం. చివరకు డీపీఆర్‌ఓ మీడియాకు ఇచ్చిన సమాచారంలో కూడా ఈ వివరాలు లేవు.



ఆత్మకూరు మండలం బి. యాలేరులో పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నెల వ్యవధిలో వెయ్యికి పైగా పింఛన్లు తొలగించడంతోనే వాస్తవాలు ప్రజలకు తెలియకుండా జాగ్రత్త పడినట్లు తెలిసింది.

2,71,607 మందికి పింఛన్లు..

జిల్లాలో 2,84,358 మంది పింఛన్ దారులుంటే ప్రభుత్వం రూ.124,74,36,000 విడుదల చేసింది. మొదటిరోజు 2,71,607 మందికి రూ.119,10,40,500 సొమ్మును సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలంలోని బి. యాలేరు గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ప్రతి సచివాలయం వద్ద రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పేదల మాటున భూ దందా



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన గుడిసెలు



గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- కూటమి నాయకుల బరితెగింపు
- ఇప్పటికే రూ. లక్షలు వసూలు
- రూ. కోట్ల స్థలం కొట్టేయాలని చూస్తున్నా పట్టని అధికారులు

అనంతపురం రూరల్: 'అవినీతి ఎక్కడ జరిగినా అడ్డుకుంటాం.. అక్రమాలకు మా పార్టీ దూరం' అని చెప్పుకునే జనసేన నాయకులు టీడీపీ నాయకులతో జతకలిసే సరికి పూర్తిగా మారిపోయారు. ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి పన్నాగం పన్నారు. పేదల మాటున భూ దందాకు తెరలేపారు. రూ. లక్షలు దండుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండల పరిధి ఉప్పరపల్లి రెవెన్యూ పొలంలోని 194–8 సర్వే నంబర్‌లో దాదాపు 10.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కలెక్టరేటుకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.3 కోట్ల దాకా విలువ చేస్తోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2015లో కొంతమంది టీడీపీ నాయకులు ఈ భూమిని ఆక్రమించాలని ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసి కబ్జాదారుల నుంచి రక్షించారు. అప్పటి నుంచి ఆ భూమిలోకి ఎవరూ వెళ్లే సాహసం చేయలేదు.

ప్రభుత్వం మారడంతో..

ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఎలాగైనా ఆ భూమిని ఆక్రమించుకోవాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. జనసేన నాయకులతో కలిసి పన్నాగం పన్నారు. హెచ్చరిక బోర్డులు ఉన్నా బేఖాతరు చేస్తూ సదరు భూమిలోకి ప్రవేశించారు. పేదలకు లేని ఆశలు రేపిపట్టాలు ఇప్పిస్తామంటూ 700కు పైగా గుడిసెలు వేశారు. పట్టాలిప్పిస్తామనే మాటున తమ జేబులు నింపుకుంటున్నారు. కురుగుంట ప్రాంతానికి చెందిన ఓ జనసేన నాయకుడు, టీడీపీ చోటామోటా నాయకులు ముగ్గురు కలసి దందా చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల దాకా వసూలు చేశారు.

పట్టని అధికారులు..

కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. చర్యలు తీసుకోకుండా చేష్టలుడిగి చూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూములతో వ్యాపారం చేస్తున్న వారి ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. ఉప్పరపల్లి సర్వే నంబర్ 194లోని భూమి వంక పొరంబోకుకు సంబంధించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– హరికుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్

పాసులకు పోటెత్తారు!

- ఒకేరోజు 10 వేల పాసుల పంపిణీ
- ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్ పరిసరాలు కిటకిట

అనంతపురం కార్పొరేషన్: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ పాసుల కోసం ప్రజలు పోటెత్తారు. శనివారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్ పరిసరాలు కిటకిటలాడాయి. వేలాది మంది క్రికెట్ అభిమానులు పాసుల కోసం బారులు తీరారు. పోలీసు బందోబస్తు మధ్య దాదాపు 10 వేల పాసులను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఏసీఏ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సయ్యద్ షాబుద్దీన్ పర్యవేక్షించారు.

- దులీప్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ), బీ గ్రౌండ్‌లో ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లు ఆడేందుకు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న దిగ్గజ క్రికెటర్లు అనంతపురం వస్తుండడంతో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచులు కొనసాగే సమయంలో స్టేడియం చుట్టుపక్కల పెద్ద ఎత్తున పోలీసు బలగాల పర్యవేక్షణ ఉంటుందని అనంతపురం రూరల్ డీఎస్పీ ఎంవీ శివారెడ్డి తెలిపారు. స్టేడియం సమీపంలోనే ప్రత్యేకంగా వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మ్యాచులు జరిగే రోజున ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు మాత్రమే మైదానంలోకి ప్రవేశం ఉంటుందన్నారు.

దులీప్ ట్రోఫీ విజయవంతంగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఈనెల 5 నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచులు విజయవంతంగా సాగేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏసీఏ, ఆర్డీటీ, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో తొలిసారిగా నిర్వహించనున్న దులీప్ ట్రోఫీకి జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం అందించాలని ఆదేశించారు. అప్పగించిన పనులను ఆయా అధికారులు బాధ్యతగా నిర్వర్తించి ట్రోఫీ విజయవంతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ పి.జగదీష్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఆదిత్యవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పాసులు పొందేందుకు బారులు తీరిన అభిమానులు



పాసులు పొందిన ఆనందంలో..

క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన కసాపురం


భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

గుంతకల్లు రూరల్: శ్రావణ మాస నాల్గవ, ఆఖరి శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. ఆంజనేయ స్వామి నామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై కొలువదీర్చి ఈవో భద్రాజీ, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివార్లను ఊరేగిస్తూ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

పశుశాఖ జేడీగా వెంకటస్వామి


నూతన జేడీఏహెచ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేసి వాటి ఫలాలు పాడి రైతులు, కాపర్లకు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి తెలిపారు. శనివారం ఆయన నూతన జేడీఏహెచ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఉన్న డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం శనివారం ఉద్యోగ విరమణ చేస్తూ కొత్త జేడీకి బాధ్యతలు అప్పగించారు. పెనుకొండ షీప్ ఫారంలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వెంకటస్వామికి ప్రస్తుతం ఇన్‌చార్జ్ జేడీగా నియమిస్తూ ఆ శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధ్యతలు చేపట్టిన నూతన జేడీఏహెచ్ వెంకటస్వామికి డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టి.సుధాకర్, ఏడీలు డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామచంద్రారెడ్డి, కార్యాలయ మేనేజర్, పలువురు డాక్టర్లు, అసోసియేషన్ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రియల్.. కుదేల్!


పుట్టపర్తి సమీపంలోని ఓ వెంచర్‌లో వేసిన ప్లాట్లు

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే బుక్కపట్నానికి చెందిన ఓ యువకుడు, హిందూపురానికి చెందిన తన సహోద్యోగిని వివాహం చేసుకున్నాడు. దంపతులిద్దరూ ఉద్యోగాలు చేయడంతో ఎక్కడైనా ప్లాట్ కొనాలని భావించారు. అబ్బాయి తరపు వారు జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కొనాలని సలహా ఇవ్వగా, త్వరలోనే హిందూపురం జిల్లా కేంద్రం అవుతుందని అందువల్ల అక్కడ కొంటే మేలని అమ్మాయి తరపు వారు తెలిపారు. ఏం చేయాలో తెలియని ఆ దంపతులు నేటికీ ఎక్కడా స్థలం తీసుకోలేకపోయారు.

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు కాగానే ఓడీసీకి చెందిన ఓ యువకుడు పుట్టపర్తి సమీపంలో రూ.లక్షలు వెచ్చించి 5 సెంట్ల స్థలం కొన్నాడు. ఇటీవల డబ్బు అవసరం కాగా ఆ స్థలాన్ని విక్రయించాలనుకున్నాడు. కానీ కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అరా తీస్తే జిల్లా కేంద్రం తరలిపోతుందని ఒకరు...ఇక్కడకొంటే ఆ నేతతో ఇబ్బందే అంటూ మరొకరు వెనక్కి వెళ్లిపోయారు.

...జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రస్తుత పరిస్థితి ఇది. జిల్లా కేంద్రం హిందూపురానికి తరలిస్తామని బాలకృష్ణ చెప్పడంతో పుట్టపర్తిలో స్థలం కొనేవారు కరువయ్యారు. ఇక మిగతా ప్రాంతాల్లో కూటమి నేతల దాడులతో భూములు కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

- శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుతో భూముల ధరలకు రెక్కలు
- జిల్లా వ్యాప్తంగా బాగా పెరిగిన 'రియల్' వ్యాపారం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అంతా తారుమారు
- బాలకృష్ణ జిల్లా కేంద్రం మార్పు ప్రకటనతో మరింత గందరగోళం
- మైనస్‌లో తొమ్మిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల గ్రోత్ రేటు
- నిర్ణయించిన లక్ష్యంలో 20 శాతం కూడా రెవెన్యూ రాని పరిస్థితి
- ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదంటున్న 'రియల్' వ్యాపారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన వైఎస్ జగన్... సేవలను మరింత చేరువ చేసేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ప్రకటించగానే జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రజలకు పాలన చేరువ కావడంతో పాటు రియల్ ఎస్టేట్‌కు బూమ్ వచ్చింది. భూములకు మంచి రేట్లు రావడంతో వ్యాపారులతోపాటు రైతులు కూడా ఎంతో ఆనందపడ్డారు. జిల్లా అభివృద్ధికి బాటలు పడ్డాయని సంబరపడ్డారు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే జిల్లా వాసుల ఆశలు అడియాసలయ్యాయి. గొడవలు, దాడులతో ఎక్కడికక్కడ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోనే కూటమి నాయకుల నిర్వాకంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది.

కొనేవారు లేక...

గడిచిన మూణ్నెళ్లుగా శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితులు పూర్తిగా మారాయి. రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో భూములు కొనుగోలు చేసిన వాళ్లు... ఇప్పుడు అమ్ముదామంటే కొనేవారు లేక విలవిల్లాడిపోతున్నారు. టీడీపీ నేతలు ఎమ్మెల్యేలుగా గెలిచాక శాంతిభద్రతలు అదుపు తప్పాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో భూముల కొనుగోలుకు సామాన్యులు ముందుకు రావడం లేదు. హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం లాంటి ప్రధాన పట్టణాల్లో కూడా కొనుగోళ్లు స్తంభించాయి. జిల్లాలో 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, అన్నింటా మైనస్ గ్రోత్ రేటు నమోదైంది.

తెరపైకి హిందూపురం..

అసలే అంతంత మాత్రంగా ఉన్న 'రియల్' వ్యాపారం... హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలతో పూర్తిగా పడిపోయింది. జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారుస్తామని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడానికి మరింత దోహదం చేశాయి. స్వయానా సీఎం చంద్రబాబుకు బావమరిది కావడం, హిందూపురానికి ఎమ్మెల్యే అవడం వల్ల జిల్లా కేంద్రం ఆ మూలకు తరలిపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన అందరిలో నెలకొంది. ఇలా ఒకటి కాదు రెండు కాదు రకరకాల కారణాలతో శ్రీసత్యసాయి జిల్లాలో స్థిరాస్తి రంగం దారుణంగా పడిపోయిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకూ రిజిస్ట్రేషన్ శాఖ వసూళ్లు ఇలా

కార్యాలయం	లక్ష్యం	వసూళ్లు	గ్రోత్ రేటు
చిలమత్తూరు	రూ.28.80 కోట్లు	రూ.6.33 కోట్లు	-9.01
సీకే పల్లి	రూ.8.10 కోట్లు	రూ.1.22 కోట్లు	-39.09
ధర్మవరం	రూ.54.55 కోట్లు	రూ.10.31 కోట్లు	-10.83
హిందూపురం	రూ.68.40 కోట్లు	రూ.10.76 కోట్లు	-21.37
కదిరి	రూ.42.65 కోట్లు	రూ.8.21 కోట్లు	-10.48
మడకశిర	రూ.12.68 కోట్లు	రూ.2.73 కోట్లు	-9.12
పెనుకొండ	రూ.27.54 కోట్లు	రూ.4.99 కోట్లు	-7.48
తనకల్లు	రూ.5.52 కోట్లు	రూ.79 లక్షలు	-46.49
బుక్కపట్నం	---	---	-6.96

9 జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

రూ.248 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం వసూళ్ల లక్ష్యం

రూ.50 కోట్లు నాలుగు నెలల్లో వసూళ్లయిన మొత్తం

బాలయ్య వ్యాఖ్యలతో రియల్ ఢాం


జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. ఇందుకు వివిధ కారణాలున్నాయి. హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేస్తామంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అందరినీ గందరగోళంలోకి నెట్టేశాయి. దీంతో కాస్తకూస్తో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. క్రయ, విక్రయాలు బాగా తగ్గాయి. అయినా బాలకృష్ణ చెప్పినంత మాత్రాన జిల్లా కేంద్రం మారిపోదు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి.
– మారుతీ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి

క్రయ విక్రయాలు తగ్గాయి


జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారుస్తామని బాలకృష్ణ చేసిన ప్రకటన రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ప్రభావం చూపింది. దీంతో భూముల క్రయ విక్రయాలు బాగా తగ్గాయి. నాడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టపర్తి జిల్లా కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడంతో రియల్ వ్యాపారం భారీగా పుంజుకుంది. ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది.
– ఘంటసాల సుబ్బరాజగుప్తా, పుట్టపర్తి

మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) వద్ద ఏర్పాటైన సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్‌ను దత్తతకు తీసుకొని కార్మికులందరికీ జీతాలను సక్రమంగా అందించి గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తానని పుట్టపర్తిలో జరిగిన యువగళం సభ సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలుపుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. సత్యసాయి ప్రాజెక్ట్‌లో 570 మంది. శ్రీరామిరెడ్డి ప్రాజెక్ట్‌లో 600 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి ఆరు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఎఫ్ సుమారు 20 నెలలుగా జమ చేయలేదన్నారు. పెండింగ్ జీతాలివ్వకపోతే ఈ నెల ఐదో తేదీ నుంచి సమ్మెబాట పడతామని కార్మికులతో కలిసి ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చామని తెలిపారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. యువగళంలో చేసిన వాగ్దానం మేరకు మంత్రి లోకేష్ స్పందించి కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఆరోపణలున్న వారికి పదవులు సిగ్గుచేటు'

అనంతపురం సెంట్రల్: అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లుగా నియమించడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2015–18లో జేఎన్‌టీయూ కలికిరి పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ కృష్ణయ్యకు ఇటీవల జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ఎలా పదవి ఇస్తారని ప్రశ్నించారు. ఈసీ ఆమోదం లేకుండా రూ.80 కోట్ల పనులు డీఈపీ ఇచ్చారని తెలిపారు. రూ.45 కోట్లు అదనంగా చెల్లించారని లోకాయుక్తలో కేసు కూడా నమోదైందని గుర్తు చేశారు. ఆడిట్ జనరల్ విచారణలో కూడా అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. అలాంటి వారికి ఉన్నత పదవులు కట్టబెట్టడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి వివరణ ఇవ్వాలని విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులిచ్చారని, ఇప్పుడు ఆయన ఏ విధంగా సహకరిస్తారని ప్రశ్నించారు. ఈయనతో పాటు యోగివేమన యూనివర్సిటీ వీసీ పైనా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. వెంటనే ఇలాంటి వారిని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా సుబ్రహ్మణ్యం

అనంతపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యంకు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ (ఇన్‌చార్జ్)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్రహ్మణ్యంకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

- తుపాను నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి రూరల్: తుపాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని అనంతపురం సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్స్) వరకుమార్, నెల్లూరుకు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతికి జనరల్ మేనేజర్ రామచంద్రరావు, కడపకు జనరల్ మేనేజర్ మురళి, కర్నూలుకు జనరల్ మేనేజర్ ఇస్మాయిల్ అహమ్మద్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి ఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అలాగే సంస్థ వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

31సీడీఆర్02-300075 : సీఎండీ సంతోషరావు

రైల్లో బాలుడి అపహరణ

- 12 గంటల్లోనే ఛేదించిన 'అనంత' పోలీసులు


బాలుడిని కిడ్నాప్ చేసి అరెస్టయిన గుల్బర్గా దంపతులతో పోలీస్ అధికారులు


తల్లిదండ్రులకు మూడేళ్ల బాలుడిని అప్పగించిన పోలీస్ అధికారులు, సిబ్బంది

అనంతపురం సిటీ: ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో తల్లిదండ్రులతో కలసి ఆదమరచి నిద్రిస్తున్న బాలుడిని పిల్లలు లేని ఓ జంట కిడ్నాప్ చేసింది. అపహరించుకుపోయిన 12 గంటల వ్యవధిలోనే అనంతపురం రైల్వే పోలీసులు కేసును ఛేదించారు. బాలుడితో సహా కిడ్నాపర్లను పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రాయచూరుకు చెందిన ప్రకాశ్, శారదాబాయి దంపతులు కూలీనాలి చేసుకొని జీవనం సాగించేవారు. ఉపాధి కోసం తమ ఇద్దరు పిల్లలు జ్ఞానయోగి(3), అను(7 నెలలు)తో కలసి శుక్రవారం ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న జనరల్ బోగీలోనే గుల్బర్గాకు చెందిన రూపేష్, కుసుమ దంపతులు కూడా ఎక్కారు. అప్పటికే అలసిపోయి ఉన్న ప్రకాశ్ దంపతులు తమ పిల్లలతో కలసి నిద్రపోయారు. తమకు పెళ్లయ్యి 20 ఏళ్లయినా పిల్లలు లేరని దిగులుగా ఉన్న రూపేశ్, కుసుమ దంపతుల చూపు ఆదమరచి నిద్రపోతున్న జ్ఞానయోగిపై పడింది. ఆ బిడ్డను ఎత్తుకుపోయి పెంచుకుందామనుకున్నారు. అంతే బిడ్డను అపహరించి అదేరోజు అర్ధరాత్రి అనంతపురం రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. కొన్ని క్షణాల వ్యవధిలోనే ప్రకాష్ దంపతులు నిద్రలేచి చూసే సరికి బిడ్డ కనిపించలేదు. ఆందోళనతో స్టేషన్‌లోకి వచ్చి రైల్వే పోలీసులను సంప్రదించారు. వారు సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి కిడ్నాపర్ల కోసం రంగంలోకి దిగారు. రైల్వే స్టేషన్ నుంచి బయటకు వచ్చిన కిడ్నాపర్లు బస్సులో గుల్బర్గా చేరుకున్నారు. తమకు లభించిన ఆనవాళ్ల ఆధారంగా అనంతపురం జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్, ఏఎస్‌ఐ మహమ్మద్ రఫీ తమ సిబ్బందితో కలసి గుల్బర్గా పోలీసుల సహకారంతో రూపేశ్ ఇంటికి వెళ్లారు. బిడ్డతో సహా ఆ దంపతులిద్దరినీ పట్టుకొని అనంతపురం తీసుకువచ్చారు. తమదైన శైలిలో విచారణ చేస్తే.. బిడ్డను ఏ పరిస్థితుల్లో అపహరించాల్సి వచ్చిందో చెప్పారు. ఆ దంపతులు ఇచ్చిన సమాధానం విని పోలీసులు విస్తుపోయారు. పిల్లల్లేరనే ఉద్దేశంతో మరో తల్లికి కడుపుకోత మిగులుస్తారా అని పోలీసులు వారిని నిలదీశారు. శనివారం మధ్యాహ్నం బాధిత ప్రకాశ్, శారదాబాయి దంపతులకు మూడేళ్ల బాలుడు జ్ఞానయోగిని అప్పగించారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

అనంతపురం అర్బన్: బియ్యం, రేషన్ సరుకులు ఆదివారం నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 6.67 లక్షల రేషన్ కార్డులకు 9,716 టన్నుల బియ్యం, 325 టన్నుల చక్కెర, 28 టన్నుల గోధుమ పిండిని 1,645 చౌక దుకాణాలకు సరఫరా చేశామని తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు కార్డుదారులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు.

టమాట రైతుల నిలువుదోపిడీ

- డీఆర్వోకు రైతు సంఘం నాయకుల ఫిర్యాదు

అనంతపురం అర్బన్: జాక్‌పాట్, కమీషన్ పేరిట టమాట రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున తదితరులు శనివారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రైతులు టమాట పంటను కక్కలపల్లి మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు, మండీ నిర్వాహకులు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని తెలిపారు. జాక్‌పాట్ పేరుతో 100 బాక్సులకు నాలుగు బాక్సులు ఉచితంగా తీసుకుంటున్నారన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కక్కలపల్లి మార్కెట్‌లో కమీషన్ పేరుతో 10 శాతం వసూలు చేస్తున్నారన్నారు. హమాలీ పేరుతోనూ డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, దుర్గా ప్రసాద్, నాగేష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా రెండోదశ కాలువకు నీరు విడుదల

బెళుగుప్ప: శ్రీశైలం జలాశయం నుంచి అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా జీడిపల్లి రిజర్వాయర్‌కు నీరు చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం (1.681 టీఎంసీలు) చేరడంతో శనివారం హంద్రీ-నీవా రెండో దశ కాలువకు ఏఈఈలు దాదాఖలందర్, భీమలింగేశ్వర, మల్లికార్జున ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు.


మోటార్లను ఆన్ చేసి నీరు వదులుతున్న దృశ్యం

దొంగల ముఠా అరెస్ట్

- 82 గ్రాముల బంగారం స్వాధీనం


బంగారం దొంగతనం చేసిన మహిళలు

ఆత్మకూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను ఏమార్చి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తస్కరించే మహిళా దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 82 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి శనివారం ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. ఆగస్టు 26న కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మల్లె నాగలక్ష్మికి చెందిన 25 గ్రాముల బంగారు లాంగ్ చైన్, శ్రీదేవి అనే మహిళకు చెందిన 39 గ్రాముల నల్లపూసల దండ చోరీ అయ్యాయి. బాధితురాలు నాగలక్ష్మి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఆత్మకూరు మండలం వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంటా దుర్గా లక్ష్మి, గంటా లలిత (అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి), తోటా లలిత, మేకల దుర్గా (చిత్తూరు జిల్లా మంగసముద్రం గ్రామానికి చెందిన వీరు ప్రస్తుతం రాచానపల్లిలో ఉంటున్నారు) అనే నలుగురు మహిళలు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. దీంతో వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా.. బస్సులో బంగారు నగలు అపహరించినది తామేనని ఒప్పుకున్నారు. ఈ నలుగురు మహిళలు ఆత్మకూరు, విడపనకల్లు, కళ్యాణదుర్గం టౌన్, కూడేరు పోలీసు స్టేషన్ల పరిధిలో కూడా దొంగతనాలు చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి మల్లె నాగలక్ష్మికి సంబంధించిన 25 గ్రాముల లాంగ్ చైన్, శ్రీదేవికి చెందిన 39 గ్రాముల నల్లపూసల దండతో పాటు విడపనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసిన 18 గ్రాముల నెక్లెస్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటటి విలువ సుమారు రూ. 3.55 లక్షలు ఉంటుందని చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు కృషి చేసిన ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఇన్‌చార్జ్ సీఐ వెంకటేష్ నాయక్, ఏఎస్ఐ దస్తగిరి, హెడ్‌కానిస్టేబుల్ చౌడప్ప, కానిస్టేబుళ్లు సురేష్‌నాయక్, పెద్దన్న, అహమ్మద్ అతీక్, హరికృష్ణ, శంకర్, మహిళా పోలీసు ఆశాభానును ఎస్పీ జగదీష్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

సఫాయికర్మచార రహిత జిల్లాగా 'అనంత'

- అభ్యంతరం ఉంటే 11వ తేదీలోగా తెలపాలి

అనంతపురం అర్బన్: సఫాయి కర్మచార రహిత జిల్లాగా 'అనంత'ను ప్రకటించామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేదీలోగా తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో సఫాయి కర్మచారులు, ఇన్–సానిటరీ మరుగుదొడ్లు లేవని జిల్లా పంచాయతీ, నగర, పురపాలక సంఘాల నుంచి నివేదికలు అందాయని పేర్కొన్నారు. దీంతో సఫాయి కర్మచార రహిత జిల్లాగా ప్రకటించామని తెలిపారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత తేదీలోగా సంబంధిత మునిసిపాలిటీ, మండల ప్రజాపరిషత్ అధికారుల ద్వారా జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రమీళ సేవలు మరువలేనివి



స్టాఫ్‌నర్స్ ప్రమీళను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: స్టాఫ్‌నర్స్ ప్రమీళ సేవలు మరువలేనివని గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సు ప్రమీళ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజినీ తదితరులు పూలమాల, శాలువాతో సన్మానించారు. 30 ఏళ్లకుపైగా ప్రమీళ రోగులకు సేవలందించారు. శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్‌నర్సులు సైరాభాను, మహాలక్ష్మి, మంగమ్మ, ఆశాలత, స్టాఫ్‌నర్సులు లత, మాజీ మేయర్ మదమంచి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరెడ్డిపల్లిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సీఐ హేమంత్ కుమార్

రాప్తాడురూరల్: శ్రావణ మాసం సందర్భంగా అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లిలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో భక్తిశ్రద్ధలతో అందరూ ఐకమత్యంగా ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పి.రామకృష్ణ, బుల్లే నాగేష్, పోలేరయ్య, మారుతి ప్రసాద్, తిరుపతయ్య, రామాంజనేయులు, తిరుపాలు, అనంతయ్య, పోలన్న, రమేష్, గణేష్, మారుతి పాల్గొన్నారు.

నేడు సర్పసూక్త హరిద్రాభిషేకం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శత సర్పసూక్త హరిద్రాభిషేకం, అశ్లేషాబలి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు రాహుకేతు హోమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి



అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కల్లేటి నాగమణి నియమితులయ్యారు. ఈనెల 30న కడపలో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌ల కౌన్సెలింగ్ జరిగింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో హెడ్‌నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న ఈమెకు పదోన్నతిపై అనంతపురం ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న మరో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా అవకాశం వచ్చింది. 1986లో ఈమె స్టాఫ్‌నర్సుగా, 2013లో హెడ్‌నర్సు, ఇప్పటి వరకు 38 ఏళ్ల పాటు రోగులకు సేవలందించారు. మరో రెండ్రోజుల్లో ఈమె బాధ్యతలు తీసుకోనున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం రూరల్: రాబోవు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతపురం తహసీల్దార్ హరికుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల వల్ల ప్రజల ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 9642922911 సంప్రదించాలన్నారు.



భద్రత కట్టుదిట్టం చేయాలి

కోలకతాలో జరిగిన ఘటన అత్యంత దారుణం. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహించుకునేలా భద్రతను కట్టుదిట్టం చేయాలి. వీలైతే సీనియర్ మాజీ సైనికులను సెక్యూరిటీ విభాగంలో కీలక పోస్టును కేటాయించి పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఎమర్జెన్సీ, ఏఎంసీ, ఐసీసీయూ తదితర అత్యవసర విభాగాల్లో అతిగా అటెండర్స్ వెళ్లకుండా చూడాలి. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించే ప్రాంతాల్లో వైద్యులకు ఎటువంటి డిస్టర్బెన్స్ ఉండకూడదు. వివిధ వార్డులో సమయపాలనతో అటెండర్స్‌ను లోపలికి పంపాలి.

– డాక్టర్ జొన్నా సత్యనారాయణ, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు

నిఘా పటిష్టం చేయాలి

సర్వజనాస్పత్రిలో రోగులకు ఉత్తమ సేవలందించేలా వైద్యులు, స్టాఫ్‌నర్సులు, తదితర సిబ్బంది కృషి చేస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో ఎమర్జెన్సీ మెడిసిన్, ఏఎంసీ, ఐసీసీయూ, తదితర వార్డుల్లో రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా రావడం వల్ల రోగులకు మరింత ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. దీంతో పాటుగా రోగుల పరిస్థితి గురించి పదే పదే వైద్యులను ఇబ్బందులు గురి చేస్తుంటారు. కొంత మంది వైద్యులు, స్టాఫ్‌నర్సుల పట్ల దురుసుగా వ్యవహరిస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. వైద్య సిబ్బందితో గౌరవంగా మెలగాలి. రోగులకు మెరుగైన వైద్య సేవలందించడమే మా లక్ష్యం. నిఘాను మరింత పటిష్టం చేయాలి.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్



మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతపురం కల్చరల్: శ్రావణమాసం చివరి శనివారం కావడంతో పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి కలిసి రావడంతో వైష్ణవాలయాలు ప్రత్యేక పూజలు, శ్రీవారి నామస్మరణతో మార్మోగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారి లడ్డు పడి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆశ్రమ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో సామూహిక గోమహాలక్ష్మి పూజలు, పాద పూజలు, ఒడిబియ్యం కార్యక్రమాలు జరిగాయి. ఆర్‌ఎఫ్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, రామనగర్, బాబా మందిరం తదితర చోట్ల సామూహిక ఏడు శనివారాల వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివకోటి, శంకరమఠం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, చెరువు కట్టపై వెలసిన శనీశ్వరాలయం తదితర చోట్ల శని త్రయోదశి వేడుకల సందర్భంగా స్వామికి నవగ్రహ హోమాలు, దోషనివారణ పూజలు, తైలాభిషేకాలు చేశారు.



ఆర్‌ఎఫ్ రోడ్డులో శనివార వ్రతం ఆచరిస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో వేంకటేశ్వరుడు

ఇది రోడ్డే(నా)?

ఈ ఫొటో అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి నుంచి కొడిమి పంచాయతీ దర్గా కొట్టాలుకు వెళ్లే దారి. గతంలో కురిసిన భారీ వర్షాలకు తోడు కొర్రకోడు డ్యాం నీటిని దిగువకు వదలడంతో ఈ ప్రవాహంతో వంక కొట్టుకుపోయింది. సర్పంచ్ బండా అంజియాదవ్ తన సొంత నిధులు వెచ్చించి పెద్దపెద్ద రాళ్లు తోలించి తాత్కాలికంగా అడ్డు వేయించారు. రాళ్లపై మట్టి తోలి వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షం నీటి ప్రవాహానికి ఈ వంకలో వేసిన మట్టంతా కొట్టుకుపోయి ఇదిగో ఇలా రాళ్లు కనిపిస్తున్నాయి. నడుచుకుంటూ వెళ్లాలంటే కూడా ఇబ్బందిగా ఉంది. నిత్యం దర్గాకొట్టాలు, ఆటో కాలనీ, జర్నలిస్టు కాలనీ, ప్రజాచైతన్య కాలనీకి వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కనీసం పట్టించుకోవడం లేదు.

– రాప్తాడు రూరల్:



ప్రజలు ఇబ్బంది పడకూడదు

అనంతపురం కార్పొరేషన్: రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టడానికి సంసిద్ధంగా ఉండాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అధికారులతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాన్ ఉండటంతో అధికారులు సెలవు దినాల్లోనూ అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడ కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా, నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రధాన వంకల్లో పూడిక తీశామని పేర్కొన్నారు. పెద్ద కల్వర్టులు, వంతెనల వద్ద చెత్తాచెదారం తొలగించాలన్నారు. రజక నగర్‌లో కొద్దిపాటి వర్షం వస్తేనే మురుగు నీరు, వర్షం నీరు వెళ్లే ప్రమాదం ఉండటంతో అక్కడ తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా ఇతరత్రా వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉండటంతో ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిల్వ ఉన్న చెత్తా చెదారం, ఖాళీ టెంకాయలు, ఇతర వ్యర్థాలు ఇళ్ల వద్ద లేకుండా చేయాలన్నారు. ఎక్కడైనా పాత భవనాలు ఉంటే ఆ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తేమ ఎక్కువగా ఉండటంతో పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే వాటికి మరమ్మతు చేయాలని తెలిపారు. డోజర్లు, జేసీబీలు, ట్రీ కట్టర్లు, డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ముందే వారికి తగు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈ సుధారాణి, సుభాష్ చంద్రబోస్, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో వచ్చే వరదలపై మరింత అప్రమత్తంగా ఉండాలి. నగరంలోని ముందస్తు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న నగరంలోని నడిమి వంక, మరువ వంకను పరిశీలించారు. పూడికతీత పనులతో పాటు పిచ్చి మొక్కలను తొలగించేలా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నగరపాలక సంస్థలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వరద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వరదలు వచ్చి రజక నగర్, సోమనాథ్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందుల పడ్డారని గుర్తు చేశారు. ఆ ప్రాంతాల్లోనూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ అడ్డు లేకుండా నీటి ప్రవాహం సక్రమంగా వెళ్లేలా చూడాలని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూంను అప్రమత్తంగా చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంట అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.



మరువ వంకను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరపాలక సంస్థలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కూలిపోయే భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నగరంలో ఎక్కడైనా కరెంటు తీగలు తెగిపోయినా.. మ్యాన్ హోల్ ఉన్నా కమాండ్ కంట్రోల్ రూం నంబర్లకు 08554-230234, 08554-274765 కాల్ చేయాలని సూచించారు.

‘మహిళలపై దాడులు సరికాదు’

అనంతపురం టవర్‌క్లాక్: రోజు రోజుకు మహిళలు, పిల్లలు, విద్యార్థినులపై దాడులు పెరిగి పోతున్నాయి. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబుళ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కోడవండ్ల అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇటీవల ఇంజినీరింగ్ కళాశాలలో బాత్‌రూములో సీసీ కెమెరాలు అమర్చి 300 లకు పైగా వీడియోలు తీయడం బాధాకరమన్నారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అత్తర్ గౌసియా, ప్రెసిడెంట్ గోవింద నాయక్, నాగాచారి, కిశోర్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్‌కు స్థల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటుకు ఆస్పత్రి వెనుక వైపు ఉన్న పలు ప్రాంతాలను నగరపాలక సంస్థ ఎస్‌ఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ పరిశీలించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో శనివారం మొదట వారు ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావును కలిశారు. ఆస్పత్రి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించాలని సూపరింటెండెంట్ సూచించారు. ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ శివకుమార్‌తో కలసి వారు ఆస్పత్రి వెనుక వైపు ఉన్న పలు ప్రాంతాలను పరిశీలించారు.

ఇంటి వద్దకు సొమ్ము ఉత్తిదే

- రాచానపల్లిలో సచివాలయం, రామాలయం వద్ద పింఛన్ పంపిణీ

రాప్తాడురూరల్: సామాజిక పింఛన్ల కోసం ఎవరూ కార్యాలయాల వద్దకు రావొద్దని గతంలోమాదిరిగా ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారకముందే వలంటీర్లు ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులను ఇంటింటికీ పంపి పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు పలుమార్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. శనివారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో పంపిణీ చేసిన పింఛన్లే ఇందుకు నిదర్శనం. కొందరు ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి ఇవ్వగా మరికొందరు సచివాలయం వద్ద, రామాలయం వద్దకు పింఛన్‌దారులను పిలిపించి అక్కడ పంపిణీ చేశారు. ఇదేమని అడిగితే... ఉద్యోగులు తక్కువగా ఉన్నామని అన్ని ఇళ్లకూ వెళ్లి ఇవ్వడం సాధ్యం కాదంటూ చెబుతున్నారు. గతంలో ఇంటివద్దకు వచ్చి ఇచ్చేవారని ఈ ప్రభుత్వంలో ప్రతినెలా సచివాలయం వద్దకు వచ్చి పడిగాపులు కాస్తున్నామంటూ పింఛన్‌దారులు వాపోయారు. ఉదయం 6 గంటలకు ఇస్తామని చెప్పి 9 గంటలైనా చాలామందికి పింఛన్లు ఇవ్వలేదు.



రాచానపల్లి సచివాలయ ఆవరణలో పింఛన్‌దారుడి ఫొటో తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగి

పీజీ డిప్లొమా ఇన్ ఫారిన్ లాంగ్వేజస్ ఫలితాల విడుదల

అనంతపురం సెంట్రల్: ఎస్కే యూనివర్సిటీ–ఆర్డీటీ స్కూల్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజస్ ఆధ్వర్యంలో పీజీ డిప్లొమా ఇన్ ఫారిన్ లాంగ్వేజస్ (స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్) కోర్సుల ఫలితాలను శనివారం వైస్ చాన్సలర్ అనిత విడుదల చేశారు. 59 మంది విద్యార్థులకు ప్రొవిజనల్స్, మార్క్స్ లిస్ట్ అందజేశారు. పరీక్షలు జరిగి నెల రోజుల్లో ఫలితాలు విడుదల చేయడంపై వీసీ అభినందించారు. ఇలాంటి కోర్సులతో విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డీటీఎస్‌ఎఫ్ ప్రిన్సిపాల్ గీతాంజలి, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

దత్తతకు చిన్నారులు

అనంతపురం సెంట్రల్: బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న మీనాక్షి(13), చాందిని (8) అమ్మాయిలకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా సంప్రదించాలి. లేకపోతే ప్రభుత్వ నిబంధనల మేరకు దత్తతకు ఇవ్వడం జరుగుతుందని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టౌన్ బ్యాంక్ చైర్మన్‌కు డాక్టరేట్

అనంతపురం అగ్రికల్చర్: ది అనంతపురం అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ (టౌన్ బ్యాంక్) చైర్మన్ జేఎల్ మురళీధర్‌కు తమిళనాడు రాష్ట్రం హొసూరులో ఉన్న ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకింగ్ రంగంలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నందున గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుముందు బ్యాంకింగ్ రంగంలో మరిన్ని మెరుగైన సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ గ్రహీతకు బ్యాంక్ పాలక వర్గం, ఉద్యోగులు పలువురు అభినందనలు తెలిపారు.



జేఎల్ మురళీధర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

విద్యార్థినికి సన్మానం

అనంతపురం సెంట్రల్: ఎస్కే యూనివర్సిటీలో ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అఫ్రిషా షానును కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, హెచ్‌ఓడీ ఆంజనేయులు శనివారం అభినందించారు. అఫ్రిషా షాను గత నెలలో చేపట్టిన మారథాన్ 5కే రన్‌లో ద్వితీయ బహుమతి, రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది. కబడ్డీలోనూ ప్రథమ బహుమతి సాధించడం జరిగిందని వివరించారు. అనంతరం విద్యార్థినిని సత్కరించారు.



అఫ్రిఫా షానును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర



మారని ఎంఎన్‌ఓల తీరు..



వర్షంలో తడుస్తూ తన తల్లిని స్కానింగ్‌కు తీసుకెళ్తున్న విశ్వనాథ్

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉన్నతాధికారుల బాధ్యతా రాహిత్యం రోగులకు శాపంగా మారుతోంది. శనివారం వేణుగోపాల్ నగర్‌కు చెందిన విశ్వనాథ్ తన తల్లి పుల్లమ్మ ఆరోగ్యం ప్రమాదకరంగా ఉండటంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్‌కు తీసుకొచ్చాడు. అక్కడి వైద్యులు పరీక్షించి స్కానింగ్‌కు రెఫర్ చేశారు. ఎంఎన్‌ఓ కోసం సంప్రదించినా ఎంతసేపటికీ రాలేదు. ఓ వైపు వర్షంలో తడుస్తూనే తల్లిని క్యాజువాలిటీ నుంచి స్కానింగ్ సెంటర్‌కు స్ట్రెచర్‌పై తీసుకెళ్లాడు. రోగులను తరలించే సమయంలో అనుభవం కలిగిన మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌ఓ) విధుల్లో ఉండాలి. కానీ అత్యవసర విభాగంలోనే ఎంఎన్‌ఓలు లేకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు మేలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పాలి.

– అనంతపురం మెడికల్:

● ఓపీల్లో ఇష్టారాజ్యం



చిన్నపిల్లల ఓపీ నంబర్–4లో వైద్యుల కుర్చీల్లో కూర్చున్న నర్సింగ్ విద్యార్థినులు



ఓపీ నంబర్–3లో పత్తాలేని అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓపీ సమయాల్లో ఓపిగ్గా కూర్చోలేక రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీని ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. శనివారం సర్వజనాస్పత్రిలో మెడిసిన్, చిన్నపిల్లల విభాగం, సర్జరీ, ఆర్థో, తదితర విభాగాల్లో వైద్యులు సమయపాలన పాటించ లేదు. ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విధుల్లో ఉండాల్సిన వైద్యులు ముందస్తుగానే వెళ్లిపోతున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఉన్నాతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.

– అనంతపురం మెడికల్: